క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయాలి



వీపనగండ్ల: రైతుల కష్టసుఖాల్లో పాలు పంచుకుని వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చినప్పుడే వ్యవసాయాధికారులకు మంచి గుర్తింపు వస్తుందని మండల వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం బదిలీపై వెళ్లిన ఏఈఓ శివకుమార్ వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోపల్‌దిన్నె, గోవర్ధనగిరి, రంగవరం గ్రామాల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ఏడేళ్ల పాటు రైతులకు చేదోడు వాదోడుగా ఉన్న శివకు రైతుల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు రజిత, విజయ్‌కుమార్ గౌడ్, మోహన్‌రెడ్డి, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



వీపనగండ్ల: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారు ఆర్థికంగా బలపడేందుకు సహకరించాలని సంగినేనిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు టైలర్ రాముడు, లక్ష్మణ్, నర్సింహులు డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసిన నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సీజనల్ వ్యాధులపై కళాజాతా



మదనాపురం: కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దుప్పల్లిలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు డెంగీ, మలేరియా సీజనల్ వ్యాధులపై తెలంగాణ సాంస్కృతిక సారథి వనపర్తి బృందం కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, కళాకారులు వల్లభాపురం శ్రీనివాస్, డప్పు నరసింహ, శివలింగం, సువర్ణ, రాధ, పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లల విడుదల



గోపాల్‌పేట: మండల కేంద్రం శివారులోని పెద్దచెరువు, అమ్మచెరువు, ఎర్రగుంట, రెడ్డకుంటల్లో మత్స్యకారులు చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులు నిండికుండలా మారినా ప్రభుత్వం తమ చేప పిల్లలు అందించడం లేదని వాపోయారు. గత ప్రభుత్వం ఈపాటికే చెరువుల్లో చేప పిల్లలను వదిలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో తామే సొంతంగా కొనుగోలు చేసిన చేప విత్తనాన్ని చెరువులో విడిచామన్నారు. కార్యక్రమంలో బొల్లెద్దుల బాల్‌రాజు, మేస్త్రీబాలయ్య, కేతేపల్లి వెంకటయ్య, అల్లెస్వామి, లక్ష్మీనారాయణ, బక్కన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.
పోటోరైటప్ః 27డబ్ల్యుఎస్‌పి200ః చెరువులో చేపపిల్లలు వదులుతున్న మత్స్యకారులు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఆత్మకూర్: మహిళలు అధిక పాలు ఇచ్చే పశువులను ఎంపిక చేసుకుని పాల వ్యాపారంలో ఆర్థికంగా రాణించాలని పశువైద్యాధికారి డాక్టర్ రమేష్, ఐకేపీ డీపీఎం అరుణ, ఏపీఎం వెంకట్ అన్నారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో అమరచింత, ఆత్మకూర్ మండలాల ఇందిరా మహిళాశక్తి ఆధ్వర్యంలో పాడి పశువుల కొనుగోలుపై మహిళలకు అవగాహన కల్పించారు. పాడి పశువులకు దాణ సరిపడ మోతాదులో అందించాలని, నట్టల నివారణ మందులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉమాదేవి, అన్వర్‌పాషా, తిరుపతమ్మ, ఆంజనేయులు, బీసన్న తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో..



పెద్దమందడి మండలంపామిరెడ్డిపల్లిలో..



దొడగుంటపల్లిలో..

బోనమెత్తిన పల్లెలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని పలు గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించారు. దీంతో ఉదయం నుంచే గ్రామాల్లో పోచమ్మ ఆలయాలను వేపాకు తోరణాలతో అలంకరించడంతో పాటు పండుగకు వచ్చిన ఆడపడుచులతో సందడి నెలకొంది. మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనంతో మేళతాళాల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయాలకు చేరుకున్నారు. బోనంలో తయారు చేసిన వంటకాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పలువులు కోళ్లు, పొట్టేళ్లు బలిచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాలు పచ్చని పంటలు, పాడితో విరజిల్లాలని వేడుకున్నారు.



ఏదులలో బోనాలతో మహిళలు



మదనాపురం మండలంలోని దంతనూర్‌లో..



శ్రీరంగాపురం మండలం నాగరాలలో..



మల్కిమియాన్‌పల్లిలో..



పాన్‌గల్‌లో బోనాలతో మహిళలు



ఆత్మకూర్ మండలంలోని గుంటిపల్లిలో..



ఖిల్లాఘనపురం మండలం మానాజీపేటలో..

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ



పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ వర్తించని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం రైతువేదికలో మండల నోడల్ అధికారి, ఏఓ సాజీద్ రహిమాన్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నా.. వివిధ కారణాలతో రుణమాఫీ వర్తించని రైతుల దరఖాస్తులతో పాటు రూ.2 లక్షలకు పైబడి అప్పులున్న రైతుల అనుమానాలను కూడా నివృత్తి చేస్తున్నామన్నారు. మాఫీ వర్తించని రైతులు దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలను జతచేయాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలో సుమారు 500 మంది రైతుల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఏఓ వెల్లడించారు.

పెబ్బేరు విద్యుత్ ఏఈగా కిరణ్‌కుమార్‌రెడ్డి

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల ఏఈగా కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో నారాయణపేట జిల్లాలోని కొత్తపల్లి ఏఈ పనిచేస్తూ.. ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయనకు సబ్ ఇంజినీర్ అభిలాష్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనను సిబ్బందిని శాలువా, పూలమాలతో సన్మానించారు.

పీహెచ్‌సీల్లోనే కాన్పులు సురక్షితం

పాన్‌గల్: గర్భిణులు తమకు నిర్దేశించిన సమయాల్లో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులకు వైద్య పరీక్షలు, ఆరోగ్యం, తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు కోసం తప్పక పీహెచ్‌సీకి రావాలని, వైద్యుల సూచనల మేరకు మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పరీక్షల నిమిత్తం వారి గ్రామాల నుంచి పీహెచ్‌సీకి రావడానికి 102 వాహనం ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లోనే కాన్పులు సురక్షితమన్నారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

బాధిత కుటుంబాలకు పరామర్శ

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కరకాల రమేష్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ రాంచందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.
మదనాపురం: మండలంలోని కొత్తపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుడు అనిమోని మాసన్నయాదవ్ తండ్రి లక్ష్మన్న మంగళవారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఆయన భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



కొత్తపల్లిలో మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కృష్ణానది ఒడ్డున మృతదేహం లభ్యం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రంగాపురం శివారులోని కృష్ణానది పుష్కరఘాట్ వద్ద ఓ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కిస్మాన్‌పూర్ రోడ్డుకు చెందిన చేజర్ల కొండారెడ్డి (87) ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి. ఇతడు ఈ నెల 26న వాకింగ్‌కు అని చెప్పి ఇంట్లోంచి వెళ్లాడు. కానీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కాలనీలో ఉన్న సీసీ కెమెరాలలో పరిశీలించగా మెయిన్‌రోడ్డు వైపు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని.. సీసీ కెమెరాలలో పరిశీలించగా మృతుడు కర్నూల్, నంద్యాల పికెట్ డిపో బస్సు ఎక్కినట్లు గుర్తించి, బస్సు డ్రైవర్‌ను ఫోన్‌లో సంప్రదించారు. రంగాపురం శివారులోని కృష్ణానది సమీపంలో బస్సు దిగిపోయాడని డ్రైవర్ పోలీసులకు తెలిపారు. మంగళవారం కృష్ణానది వెంట వెతకగా బ్రిడ్జి కింద మెట్ల వద్ద చెప్పులు కనిపించాయి. అనంతరం పుష్కరఘాట్ సమీపంలో నది ఒడ్డున మృతదేహం లభించింది. దీంతో కుటుంబ సభ్యులు పెబ్బేరు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు అక్కడు చేరుకొని మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు చేజర్ల వీరరాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

2 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వనపర్తి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలంలోని రాంపురం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాక్టర్లను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్, కమ్ ఓనర్ పుట్టా రాజు, మార్కు నరేష్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేశామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

కళాశాలలో వసతులు కల్పించాలి

ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ మాట్లాడుతూ కళాశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఒకటికి, రెండుకు ఆర్టీసీ బస్టాండుకు పోవాల్సిన పరిస్థితి దాపురించిందని, ముఖ్యంగా విద్యార్థినుల బాధలు వర్ణణాతీతమన్నారు. ఈవిషయమై ప్రిన్సిపాల్‌తో పాటు ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రమేష్, భాను, ప్రణయ్, రోహిత్, భానుచందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



ఆత్మకూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మకూర్: జిల్లా శిశు, మహిళాసాధికారిత, డీహెచ్ ఈడబ్ల్యూ, డీడబ్ల్యూఓ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోక్సోచట్టం, బాల్యవివాహాలపై మంగళవారం స్థానిక శ్రీవాణి హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి, సలోమి, నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు ఎదురైనా విద్యార్థులు ధైర్యంగా ఎదుర్కోవాలని, సమస్య జఠిలమని గుర్తిస్తే 100, 181, 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి కుటుంబ సభ్యులకు, గ్రామాల్లో వివరించాలన్నారు. పోక్సోచట్టం, బాల్యవివాహాలు, బాలలపై అఘాయిత్యాలు, ర్యాగింగ్, లైంగికవేధింపులు, మత్తుపదార్థాలు తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గంగాధర్, లత, అభిలాష, రాఘవేంద్ర, వెంకటేష్, మహేందర్, పరమేష్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 2వ సెంటర్‌లోని గుంటి శివకుమార్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో ఉన్న వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లి రాత్రి అక్కడే ఉండిపోయారు. వారు ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళాలు విరగొట్టి ఉండడంతో.. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువా తాళాలు పగులగొట్టి తలుపులు తెరుచుకొని ఉండడం గమనించారు. ఘటనలో బంగారు పుస్తెలతాడు పోయిందని బాధితుడు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఖిల్లాఘనపురం: జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరు లిస్టులో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, ఓటరు లిస్టుపై వారి అభిప్రాయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటరు నమోదుపై యువతకు అవగాహన కల్పించాలని కోరారు. మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఎస్‌ఎస్‌ఆర్ యాక్టివేషన్‌పై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ కురుమూర్తి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, ఆర్‌ఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ పాండునాయక్

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

కొత్తకోట రూరల్: శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకలను పట్టణ కేంద్రంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ వచ్చిన ఒగ్గుడోలు కళాకారుల నృత్య ప్రదర్శన, కాళీమాత వేషధారణలతో ప్రధాన రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు. యాదవులు తమ చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబు చేశారు. కానాయపల్లి సమీపంలో గల శ్రీకృష్ణ ఆలయం వద్ద ఉట్లు కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఊరేగింపులో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముంత రాములుయాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, బాలయకొండ యాదవ్, స్టార్ ఆంజనేయులు, రాములుయాదవ్, లక్ష్మయ్యయాదవ్ ఉన్నారు.

మద్దిగట్లలో..
పెద్దమందడి మండలం మద్దిగట్లలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడు ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, నాగన్న, బుచ్చిలింగం, సుదర్శన్, బాలయ్య, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.
ఆత్మకూర్: త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని రేచింతలలో శ్రీకృష్ణభగవానుడి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పెబ్బేరు, కొత్తకోట ప్రబోధసేవా సమితి నిర్వహకులు శ్రీనివాస్‌రెడ్డి, రవి, భక్తులు పాల్గొన్నారు.
ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన రవీందర్ భక్తులకు అన్నదానం చేశారు. స్వామి వారి ఆలయం వద్ద యాదవులు ఉట్లు కొట్టారు.



కొత్తకోటలో శ్రీకృష్ణుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



పెద్దమందడి మండలంలోని మద్దిగట్లలో..



ఖిల్లాఘనపురం వేణుగోపాలస్వామి ఆలయం వద్ద..



ఆత్మకూర్ మండలంలోని రేచింతలలో..

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

వనపర్తి రూరల్: గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు ప్రతి నెల మొదటి వారంలోనే జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో కలిసి డీఏల్‌పీఓ రఘునాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీ ద్వారా కార్మికులకు గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని,ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు శాపంగా మారిన మల్టీపర్పర్ విధానం తక్షణమే రద్దు చేయాలన్నారు. వారాంతపు సెలవులు ఇవ్వాలని, చదువుకున్న కార్మికులకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నారాయణ, శాంతన్న, శ్రీను, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

